తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం | సూర్యపేట | యాద్రాద్రి భువనగిరి
శుక్రవారం 29 మే 2026 | పేజీలు : 8



# కళ్ళుండి చూడలేని అధికారులు

## మణుగూరులో చెట్టు కిందే బస్సు కోసం నిరీక్షణ






- బస్సు షెల్టర్ తొలగించారు కానీ పునర్నిర్మించటం మరిచారు..
- అభివృద్ధి పేరుతో అంగట్లో నిలబెట్టిన అధికారులు..
- నిలబడలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న గర్భిణీలు, వృద్ధులు
- తక్షణమే శాశ్వత బస్ షెల్టర్ నిర్మించాలనీ స్థానికుల డిమాండ్

**మణుగూరు, మే 28 (జనంసాక్షి):** రోడ్డు విస్తరణ పేరుతో బస్సు షెల్టర్ ను తొలగించారు. కానీ నెలలు గడుస్తున్నా మళ్లీ పునర్నిర్మాణం చేయలేదు. ఫలితంగా ప్రయాణికులు ఎండలో కాలిపోతున్నారు, వర్షంలో తడుస్తున్నారు, చలిలో వణుకుతున్నారు. ఇది అభివృద్ధి ఫలమా? లేక ప్రజలపై నిర్లక్ష్యమా? అనే ప్రశ్నలు సహజంగానే ఉత్పన్నమవుతున్నాయి. మణుగూరులో ప్రధాన కూడలిలో బస్ షెల్టర్ లేక చెట్టు కింద ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వేసవిలో తాత్కాలిక నీడను ఏర్పాటు చేయటం లేదు కనీసం తాగునీరు సౌకర్యం లేకపోవడంతో చిన్న పిల్లలు మహిళలు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గర్భిణీలు, చంటి పిల్లలను ఎత్తుకొని మహిళలు ఎండలో ఎదురుచూస్తున్నారు. వృద్ధులు కింద కూర్చుంటే మళ్ళీ లేవలేని పరిస్తితి ఆరోగ్యం బాగా లేక బస్ కోసం వస్తె నిలువ నీడలేదు నిలబడి నిలబడి తీర బస్ ఎక్కితే సీటు దొరకదు అక్కడ నిలబడక తప్పటం లేద.అధికారులు ప్రజా ప్రతినిధులు ఏ సి కార్లలో తిరుగుతారు..మా బాధ.. మా గోడు.. ఎవరు తీర్చుతారనీ హృదయ రోదనతో బాధ పడుతున్న ప్రయాణికులు.

**ప్రయాణికుల కష్టాలు పట్టించుకోరా..?**

ప్రతి రోజు వందలాది మంది ప్రయాణికులు మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, కూలీలు ఈ బస్సు సెంటర్‌పై ఆధారపడుతున్నారు. ఉదయం నుంచి రాత్రివరకు బస్సుల కోసం నిల్చునే వారికి కనీసం నీడ కూడా లేదు. ఎండ తాకిడికి వడదెబ్బలు, వర్షంలో తడిసి జ్వరాలు, చలిలో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నా ఎవరికీ పట్టడం లేదు. ఇది చిన్న సమస్య కాదు. ఇది ప్రజల గౌరవానికి సంబంధించిన విషయం. బస్సు కోసం నిలబడే ప్రయాణికుడు భిక్షగాడు కాదు. అతనికి కూడా రక్షణ, సౌకర్యం అవసరం. ప్రజలు ఎన్ని సార్లు వేడుకున్నా అటు పాలకులు

మిగతా 2లో



# బాధితురాలికి అండగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

## గాలి దుమారానికి ఇల్లు కోల్పోయిన బాధితురాలికి తక్షణమే ఇల్లు మంజూరు

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల బీభత్సానికి సర్వస్వం కోల్పోయి నిలువ నీడ లేక రోడ్డున పడ్డ ఒక వృద్ధురాలి దీనస్థితికి రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి చలించిపోయారు.గాలి దుమారానికి రేకుల ఇల్లు ఎగిరిపోయి, ఆశ్రయం కోల్పోయిన ఆ బాధితురాలి కి తక్షణమే ఇల్లు మంజూరు చేయాలని మంత్రి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ను ఆదేశించారు. జిల్లాలోని మఠంపల్లి మండలం పెదవీడు లాల్ తండా గ్రామంలో గాలి దుమారం కారణంగా తాళ్లూరి జయమ్మ నివాసం ఉంటున్న రేకుల ఇల్లు పైకప్పు రేకులు గాలికి కొట్టుకుపోవడంతో,

మిగతా 2లో

# వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు

## చింతపల్లిలో రైతులతో మాట్లాడిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు

**చింతపల్లి, మే 28 (జనంసాక్షి)** మిల్లర్లు?అధికారులు కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని బిజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు అన్నారు..చింతపల్లి వడ్ల కొనుగోలు కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు గురువారం సందర్శించారు. "రైతుకోసం బీజేపీ భరోసా" కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ పర్యటనలో రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తరుగు మరియు తాలు పేర్లతో రైతుల బస్తాలకు మూడు నుంచి ఐదు కిలోల వరకు కోత విధించడం తీవ్ర అన్యాయమని మండిపడ్డారు. అదనంగా రైతుల వద్ద డబ్బులు వసూలు చేస్తూ మిల్లర్లు, అధికారులు కుమ్మక్కై రైతులను నిండా ముంచుతున్నారని ఆరోపించారు. ఈ పరిస్థితి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గుచేటని విమర్శించారు.నల్గొండ జిల్లాలో ముఖ్యంగా చింతపల్లి కొనుగోలు కేంద్రంలో రైతులను భయభ్రాంతులకు గురిచేసి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. రైతులు పండించిన ధాన్యానికి సరైన గౌరవం, న్యాయమైన ధర లభించాల్సిందిపోయి అధికారుల నిర్లక్ష్యం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులపై జరుగుతున్న అక్రమాలను ప్రభుత్వం వెంటనే అరికట్టాలని, కొనుగోలు కేంద్రాల్లో పారదర్శక విధానాలు అమలు చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. రైతులకు న్యాయం జరిగే వరకు పార్టీ తరపున పోరాటం కొనసాగుతుందని ఎన్. రామచంద్రరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజేపీ రాష్ట్ర నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# రైతులు అధైర్యపడొద్దు

## తడిసిన ధాన్యాన్నీ కొంటాం : కలెక్టర్ చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి,మే 28, (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం జిల్లాలోని కొన్ని కేంద్రాలలో అకాల వర్షానికి ధాన్యం తడిసిందని, అయితే అలాంటి ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు తరలించినట్లు కలెక్టర్ తెలిపారు. తిప్పర్తి మండలం పజ్జూరులో 650 బస్తాలు, కనగల్ మండలం లచ్చు గూడెంలో 1800 బస్తాలు, తిప్పర్తి మండలం కేశరాజు పల్లి లో 100 బస్తాలు వర్షానికి తడిచిపోగా వాటిని కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు పంపించామని, అలాగే తిప్పర్తి మండలం జొన్నల గూడెంలో 3000 బస్తాలు పాక్షికంగా తడిచాయని, అనుముల మండలం ముక్కపల్లిలోని ఐకెపిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఈరోజుతో మూసివేసేందుకు చర్యలు తీసుకోగా, 3 లారీలు కొనుగోలు కేంద్రానికి పంపించి ధాన్యాన్ని తూకం వేసి లారీలలో లోడ్ చేస్తున్న సమయంలో ఒక్కసారిగా వచ్చిన అకాల వర్షానికి చెట్లు కూలిపోవడం, పట్టాలు ఎగిరిపోవడంతో 2200 బస్తాలు వర్షానికి తడిచాయని, వాటిని కూడా కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు పంపిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.



## మహోన్నత త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ

### మౌలానా ముహమ్మద్ అమెర్ సహాబ్

కొండమల్లేపల్లి, మే 28 (జనంసాక్షి): కొండమల్లేపల్లి పట్టణంతో పాటు పరిసర ప్రాంత గ్రామాలలో గురువారం ముస్లీం సోదరులు బక్రీద్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం వారి కుమారుడు ప్రవక్త ఇస్మాయిల్ చేసిన త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను నిర్వహించుకున్నారు. ముస్లిం సోదరులు తమ ఇంటినుండి మజీద్ చేరుకొని అక్కడి నుంచి తక్బీర్ చేసుకుంటూ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర కళాశాల దగ్గర ఉన్న ఇద్గాను చేరుకున్నారు. ఈద్గాలో ముస్లిం సోదరులను ఉద్దేశించి మౌలాన ముహమ్మద్ అమెర్ సహాబ్ మాట్లాడుతూ బక్రీద్ త్యాగానితో పాటు మనోవాంఛ, అసూయ, రాగద్వేషాలు, స్వార్థం విడిచిపెట్టి మానవతను వెదజల్లాలనే ఉద్దేశంతో ప్రతి ఏడాది ముస్లీం సోదరులు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకుంటారన్నారు. అల్లాహ్ ఆదేశాల మేరకు ప్రవక్త ఇబ్రహీం తన ఏకైక కుమారుడైన ఇస్మాయిల్ ను బలి ఇవ్వడానికి సిద్ధం అవుతారు. ఆ సాంప్రదాయాన్ని స్మరిస్తూ ముస్లీం సోదరులు ప్రతి ఏడాది బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకుంటారని బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లీం సోదరులు జంతు బలి ఇచ్చి మాంసాన్ని కుల మతాలకు అతీతంగా పేద మధ్యతరగతి ప్రజలకు పంచి పెడుతారు. ఇబ్రహీం ప్రవక్త స్ఫూర్తితో దైవ మార్గంలో ప్రాణాన్ని సైతం త్యాగం చేసుకుంటూ ముస్లింసోదరులు బక్రీద్ రోజు నమాజ్ పూర్తయిన తర్వాత ఖుర్బానీ ఇస్తారని ప్రపంచవ్యాప్తంగా లక్షలాదిమంది హజ్ యాత్రికులు బక్రీద్ రోజు మక్కాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారన్నారు. ఇస్లాం సాంప్రదాయ ప్రకారం బక్రీద్ పండుగను పవిత్ర దినంగా భావిస్తారని ప్రతి ముస్లిం తన జీవిత కాలంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలని ఇస్లాం సూత్రాలు త్యాగనిరతి తోపాటు మనోవాంఛ, స్వార్థం, అసూయ, రాగద్వేషాలను కూడా విడిచిపెట్టి మానవత్వం అనేది బక్రీద్ పండుగ తెలుపుతుందన్నారు. అనంతరం ప్రత్యేక నమాజ్ నిర్వహించి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ లు చెప్పుకున్నారు. వందల సంఖ్యలో ముస్లీం సోదరులు ఈద్గాకు తరలి వచ్చి ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ అజ్మీర రమేష్ ఆధ్వర్యంలో పోలీస్ పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రార్థనలలో వివిధ మస్జిద్ ల ఇమామ్ లు, మస్జిద్ కమిటీ సభ్యులు, ఈద్గా కమిటీ సభ్యులు, పట్టణ ముస్లింలతో పాటు పరిసర ప్రాంత గ్రామాల ముస్లిం సోదరులు ఈద్గా ప్రార్థనలో పాల్గొన్నారు.

## భువనగిరిలో ఘనంగా బక్రీద్ వేడుకలు



భువనగిరి, మే 28 (జనం సాక్షి) భువనగిరి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా సమీప నూతన ఈద్గాహ్‌లో బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో ఈద్గాహ్‌కు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకుంటూ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమానికి భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బక్రీద్ పండుగ త్యాగానికి, సేవాభావానికి, మానవత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలో సోదరభావం, ఐకమత్యం పెంపొందించేందుకు ఇటువంటి పండుగలు దోహదపడతాయని అన్నారు. వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ తంగెళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, అంజుమాన్ కమిటీ అధ్యక్షుడు ఎం.ఎ. రహీమ్, అవైస్ చిస్తీ, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు. బక్రీద్ సందర్భంగా భువనగిరి పట్టణంలో పండుగ వాతావరణం నెలకొనగా, ముస్లిం కుటుంబాలు సంప్రదాయబద్ధంగా వేడుకలు జరుపుకున్నాయి.



## త్యాగానికి ప్రతీక ఈ బక్రీద్ పండుగ

హుజూర్ నగర్, (జనంసాక్షి): త్యాగానికి ప్రతీక ఈ బక్రీద్ పండుగ అని దీనిని ఈద్-ఉల్-అధా అంటారని ముస్లింల మతపెద్ద ముఫ్తి మొహమ్మద్ గౌస్ ఉద్దీన్ అన్నారు. గురువారం ముస్లింల మతపెద్ద ముఫ్తి మొహమ్మద్ గౌస్ ఉద్దీన్ ఆధ్వర్యంలో బక్రీద్ పండగ విశిష్టతను వివరించారు. ఈద్గాలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ పండుగ దేవుని పట్ల భక్తిని, త్యాగం, దాతృత్వాన్ని సూచిస్తుంది. పేదలకు, నిరుపేదలకు సహాయం చేయడం, వారికి ఆహారం అందించడం ద్వారా దాతృత్వాన్ని చాటుకుంటారని తెలిపారు. ఈద్గా వద్దకు వచ్చిన అధికారులు, పోలీసులు, బంధువులు, స్నేహితులు ముస్లిం సోదరులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఎండి.అజీజ్ పాషా, ఎం ఏ అబ్దుల్ మజీద్ భాయ్, ఎస్.కె మన్సూర్ అలీ, ఎస్.కె. బాజీ ఉల్లా, రహమతుల్లా మొల్సబ్, బిక్కన్ సాబ్, ఖాజా భాయ్, మిల్లు రహీం భాయ్, లతీఫ్ భాయి, మౌజాన్ సిరాజ్ బాయ్, భాషా భాయ్, రఫీ, బాబా, సలావుద్దీన్, మోహిన్, సద్దాం, ఖయ్యుమ్, రహీం, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ వేడుకలలో పాల్గొన్న పిల్లుట్ల రఘు



చింతలపాలెం(జనంసాక్షి) సూర్యాపేట జిల్లా,చింతలపాలెం మండలం,కృష్ణాపురం గ్రామంలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరుల పిలుపుమేరకు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలు,నమాజు కార్యక్రమం లో హుజూర్నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు పాల్గొనడం జరిగింది.రఘు మాట్లాడు తూ ఈ పవిత్రమైన రోజున మీ అందరి తో ఇలా కలిసి వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని,ఈ బక్రీద్ అందరి జీవితాల్లో సుఖ శాంతులు నింపాలని ముస్లిం సోదరులకు రఘు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

### తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన వ్యక్తి ఎన్ టి ఆర్: బత్తుల లక్ష్మారెడ్డి



జనంసాక్షి, మిర్యాలగూడ తెలుగువారి ఖ్యాతి ని ప్రపంచానికి చాటిచెప్పిన వ్యకి నందమూరి తారక రామారావు అని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం నాడు ఎన్ టీ రామారావు 103 వ వర్ధంతి సందర్భంగా మిర్యాలగూడ లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగినది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ని స్థాపించిన 9 నెలలలోనే అధికారం లోకి వచ్చి పేద ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకు వచ్చి తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి ఎన్ టీ ఆర్ అని అన్నారు.

### త్యాగానికి,భక్తి కి నిర్వచనం బక్రీద్

త్యాగానికి భక్తికి నిర్వచనం బక్రీద్ పండుగ అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు.గురువారం నాడు బక్రీద్ పండుగ పురస్కరించుకొని మిర్యాలగూడ లోని ఈద్గా మైదానం లో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమం లో ముస్లిం మైనారిటీ నాయకులు, కౌన్సిలర్స్, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కళ్ళుండి చూడలేని అధికారులు

### మణుగూరులో చెట్టు కిందే బస్సు కోసం నిరీక్షణ

ఇటు అధికారులు స్పందించడం లేదని ఆవేదన చేస్తున్నారు.

**రోడ్డు విస్తరణ పూర్తైంది? మరి బస్ షెల్టర్ ఎక్కడ..?:**
రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాయి. వాహనాలు సాఫీగా పోతున్నాయి. కానీ ప్రయాణికుల సౌకర్యం మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, వంతెనలేనా? ప్రజలు నిలబడే చోటు, వారి రక్షణ కూడా అభివృద్ధిలో భాగమే కదా? తొలగించేముందు మళ్ళీ నిర్మించాలని ఆలోచన లేకుండా ఎలా చేశారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఆర్ టి సి, మున్సిపల్ అధికారులు కళ్ళు ఉండి చూడలేని కబోదుల వ్యవహరిస్తున్నారు.

**తాత్కాలిక ఏర్పాట్లు చేయలేని పరిస్థితి:**
కనీసం తాత్కాలిక షెడ్డు, టిన్ షీట్, షామియానా లాంటి ఏర్పాట్లు కూడా చేయలేదు. ఇది ఖర్చుతో కూడిన పని కాదు. కానీ చేయాలనే సంకల్పం ఉంటే సాధ్యపడుతుంది. అభివృద్ధి పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదు ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే అంబేద్కర్ సెంటర్‌లో శాశ్వత బస్ షెల్టర్ నిర్మించాలి.

**త్వరలో బస్ షెల్టర్ ఏర్పాటు:**
ప్రధాన సెంటర్ కావడం వల్ల ఎక్కడ నిర్మించాలనీ మొదట కొంత ఆలస్యమైంది ఇటు ప్రయాణికులకు అటు వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా స్థానిక ఎమ్మెల్యే ఆర్టీసీ అధికారులు, మణుగూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సంబంధిత కాంట్రాక్టర్ గతంలో స్థల పరిశీలన చేయడం జరిగింది. అంచనా వ్యయం ఎంత అవుతోందని మాట్లాడారు. ఆ తర్వాత కొంత జాప్యం జరిగింది. సంబధిత కాంట్రాక్టర్, ఆర్టిసి అధికారులు తో మాట్లాడి త్వరలో బస్ షెల్టర్ ఏర్పాటు చేస్తామని అన్నారు.

- టి ప్రసాద్ రావు మున్సిపల్ కమిషనర్ మణుగూరు.

## బాధితురాలికి అండగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

### గాలి దుమారానికి ఇల్లు కోల్పోయిన బాధితురాలికి తక్షణమే ఇల్లు మంజూరు

ఆమె నిలువ నీడ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది.వృద్ధాప్యంలో తలదాచుకోవడానికి చోటు లేక ఆమె పడుతున్న అవస్థల గురించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి వచ్చింది.ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలను ఆదుకోవడమే ప్రభుత్వ మొదటి ప్రాధాన్యతగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బాధితురాలి పరిస్థితిపై తక్షణమే స్పందించారు.జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి, మానవతా దృక్పథంతో ఈ సమస్యను పరిష్కరించాలని సూచించారు.బాధితురాలికి తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆమెకు ప్రకృతి వైపరీత్యాల కింద ఇల్లు తక్షణమే మంజూరు చేయాలని ఆదేశించారు.

## త్యాగానికి, దైవభక్తికి ప్రతీక బక్రీద్

కోదాడ,( జనంసాక్షి): బక్రీద్ పండుగ త్యాగానికి, దైవభక్తికి ప్రతీక అని కోదాడ పెద్ద మసీదు ఇమామ్ మౌలానా అబ్దుల్ ఖాదీర్ సాహెబ్ పేర్కొన్నారు. గురువారం కోదాడ సాలార్జంగ్ పేట లో ఈద్గా లో బక్రీద్ పర్వ దినం సందర్భంగా సామూహిక ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మాట్లాడారు.ప్రవక్త ఇబ్రహీం అల్లాహ్ ఆజ్ఞకు లోబడి తన కుమారుడిని త్యాగం చేయడానికి సిద్ధపడిన సంఘటనను స్మరించుకుంటూ ముస్లింలు బక్రీద్‌ను జరుపుకుంటారని తెలిపారు. ఈ పండుగ ద్వారా సహనం, సేవాభావం, సోదరభావం పెంపొందుతాయని అన్నారు.బక్రీద్ సందర్భంగా ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించి దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ప్రార్థనలు చేస్తారని చెప్పారు. జంతు బలి ద్వారా త్యాగనిరతి, వినయం, దైవభక్తి ప్రతిబింబిస్తాయని తెలిపారు. బలి మాంసాన్ని పేదలు, అనాథలు, బంధుమిత్రులతో పంచుకోవడం ద్వారా సమానత్వ భావన పెరుగుతుందని పేర్కొన్నారు. యువత మానవతా విలువలను అలవర్చుకొని సమాజ సేవలో ముందుండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవం, ప్రేమాభిమానాలతో పండుగను జరుపుకోవాలని ఆయన కోరారు. ప్రార్థనల అనంతరం ఒకరి కొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపు కున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక 9 వ వార్డ్ కౌన్సిలర్ చీమ నరేష్ బాబు, నాయకులు షేక్ నయీమ్, శమ్మీ,రహీం, ముస్తఫా,సాదిక్ తో పాటు అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

○ప్రతి ఒక్కరూ దానగుణం,సేవ గుణం అలవర్చుకోవాలి ○బక్రీద్ త్యాగం, శ్రద్ధ,కరుణ,మరియు దాతృత్వానికి నిదర్శనం ○సయ్యద్ మాజీద్ మౌలానా, దేవరకొండ ○పటిష్ట బందోబస్తు చేసిన పోలీసులు ○మున్సిపల్ శాఖకి, పోలీస్ శాఖ కి కృతజ్ఞతలు తెలిపిన దేవరకొండ ముస్లిం సమాజం





**దేవరకొండ, మే 28 (జనంసాక్షి):** బక్రీద్ పండుగను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లింలు నూతన వస్త్రములు ధరించిపెద్ద సంఖ్యలో తరలివచ్చి సామూహిక ప్రార్ధనలు చేశారు. పిల్లలు పెద్దలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లిం మత పెద్ద మౌలానా సయ్యద్ మాజీద్ ఆధ్యాత్మిక ప్రాంగణం చేస్తూ ఇస్లాం మతం గురించి,( ఈదుల్ అద్హ ) బక్రీద్ యొక్క ప్రాముఖ్యత మరియు హజరత్ ఇబ్రహీం అలైహి సలాం యొక్క త్యాగాల గురించి గుర్తు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వార్థం,అసూయ,రాఘద్వేషాలలో విడిచిపెట్టి మానవుల్లో త్యాగనిరాతిని వ్యాప్తి చేయడమే బక్రీద్ పండుగ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. అన్ని గుణాల కన్నా దాన గుణమే ఉత్తమమైనదని బక్రీద్ ముఖ్య ఉద్దేశం ఇదే అని అన్నారు. హజరత్ ఇబ్రహీం త్యాగానికి స్మరించుకుంటూ, సమైక్యతను మానవత్వాన్ని త్యాగ గుణాన్ని బక్రీద్ పండుగ స్ఫూర్తి అని అన్నారు. సమాజంలో వివిధ అంశాలలో కుర్బానీ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని ఇది పేద ప్రజలను సంతృప్తి పరుస్తుందని ముస్లింలను ఏకం చేసి సర్వశక్తిమంతుడైన అల్లాకు లొంగిపోయేలా చేస్తుందని అన్నారు. మున్సిపల్ శాఖకి, పోలీస్ శాఖ కి ఈద్గా కమిటీ ముస్లిం సమాజం తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఈద్గా కమిటీ అధ్యక్షప్రధాన కార్యదర్శులు సయ్యద్ అజీమోద్దీన్, ఇలియాస్ పటేల్, ఎం ఏ ఖదీర్ సాలర్, అన్సారీ కలీం, ఖుద్రతుల్లాహ్, అలీం మౌలానా, ఖాజా మైనొద్దీన్, సయ్యద్ దస్తగిర్, యండి ముజీబ్, ఎస్ కె బురానొద్దీన్, మహ్మద్ షకీల్, తదితరులు పాల్గొన్నారు.

# త్యాగం దాతృత్వానికి ప్రతీక బక్రీద్

## ముస్లింల మత పెద్ద : మహమ్మద్ గౌసుద్దీన్



**హుజూర్ నగర్ మే 28 (జనంసాక్షి):** ముస్లింల ప్రధాన పండుగలలో ఒకటైన బక్రీద్ (ఈద్–ఉల్–ఆధా) త్యాగానికి, భక్తికి, దాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని ముస్లింల మత పెద్ద మహమ్మద్ గౌసిద్దీన్ అన్నారు. పట్టణంలో గురువారం ఈద్గా లో ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ అల్లాహ్ ఆజ్ఞకు పూర్తిగా విధేయత చూపిన ప్రవక్త ఇబ్రహీం త్యాగస్ఫూర్తిని స్మరించుకుంటూ ఈ పండుగను ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు ఘనంగా జరుపుకుంటారన్నారు. ఇస్లామీయ విశ్వాసాల ప్రకారం, అల్లాహ్ ఆజ్ఞ మేరకు తన కుమారుడు ఇస్మాయిల్‌ను బలి ఇవ్వడానికి ప్రవక్త ఇబ్రహీం సిద్ధపడ్డారు. ఆయన భక్తి, నమ్మకాన్ని గుర్తించిన అల్లాహ్ చివరికి కుమారుడి స్థానంలో ఓ జంతువును బలి ఇవ్వమని ఆదేశించాడని చెబుతారు. ఆ త్యాగస్ఫూర్తికి గుర్తుగానే బక్రీద్ పండుగను జరుపుకుంటారు. ఈ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, మేకలు లేదా గొర్రెలను ఖుర్బానీ చేస్తారు. ఖుర్బానీ చేసిన మాంసాన్ని కుటుంబ సభ్యులతో పాటు నిరుపేదలకు పంపిణీ చేస్తారు. సమాజంలో ప్రేమ, సహకారం, దాతృత్వ భావాలను పెంపొందించడమే ఈ పండుగ ప్రధాన ఉద్దేశమని మత పెద్దలు పేర్కొంటున్నారు. బక్రీద్ రోజున బంధువులు, స్నేహితులు, మిత్రులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుని ఆనందాన్ని పంచుకుంటారన్నారు. మత సామరస్యానికి, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగ సమాజానికి మంచి సందేశాన్ని అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు ఎండి అజీజ్ పాషా, ఎం ఏ అబ్దుల్ మజీద్ భాయ్, షేక్ మన్సూర్ అలీ, షేక్ బాజీ ఉల్లా, రహమతుల్లా, మొల్సబ్, షేక్ బిక్కన్ సాబ్, ఖాజా, రహీం, మౌజాన్, సిరాజ్, బాషా, రఫీ, బాబా, సలావుద్దీన్, మోహిన్, సద్దాం, ఖయ్యూమ్, రహీం, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.



# మొక్కజొన్న కొనుగోలుతో రైతుకు మద్దతు ధర

## రుణాల వసూళ్లకు న్యాయపరమైన చర్యలు- సోసైటీ చైర్మన్ దుగ్గినేని

**కారేపల్లి, మే28(జనంసాక్షి) :**
కారేపల్లి సోసైటీ ఆధ్వర్యంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పట్టుదలతో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ద్వారా రైతుకు మద్దతు ధర కల్పించటం జరిగిందని కారేపల్లి సోసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం కారేపల్లి సోసైటీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోసైటీ ద్వారా మాధారంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ద్వారా 803 రైతులకు సంబంధించి రూ.11.94 కోట్ల విలువైన 49758.50 క్వింటాళ్ళ మొక్కజొన్నను కొనుగోలు చేయటం జరిగిందన్నారు. దీని ద్వారా రైతులకు రూ.2.99 కోట్లు లాభం చేకూరిందన్నారు. మొక్కజొన్న కొనుగోలు సంబంధించి ప్రభుత్వం పైకం విడుదల చేసిందని, రైతు ఖాతాలో మూడు రోజులలో రైతు ఖాతాలలో జమ కానున్నాయని తెలిపారు. సోసైటీ రుణ వసూళ్లపై ప్రత్యేక కార్యాచరణ చేసినట్లు తెలిపారు. రైతులు తప్పని సరిగా వడ్డీలు చెల్లించి రుణాలు రెన్యూవల్ చేసుకోవాలన్నారు. రుణాల రెన్యూవల్ చేసుకోవటం ద్వారా రుణమాఫీ, పావలా వడ్డీ రాయితీ పొందవచ్చున్నారు. బకాయిల వసూళ్లకు ఇప్పటికే న్యాయపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే బకాయిదారులకు నోటీసులు ఇవ్వటం జరిగిందన్నారు. రికవరీ సెక్షన్ ద్వారా రుణ వసూళ్లకు జప్తులు, తనఖా పెట్టిన భూములపై జెండాలు పెట్టి స్వాదీనంకు చర్యలు జరుగుతున్నాయన్నారు. రైతు సోదరులు సోసైటీని వినియోగించుకోవటం ద్వారా అర్ధిక అభివృద్ధి చెందాలని కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి బల్లు హనుమంతరావు, డైరక్టర్లు అడ్డగోడ ఐలయ్య, మర్సకట్ల రోషయ్య, కొత్తూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.



# కారేపల్లిలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి

## రోగులకు పండ్లు పంపిణి చేసిన టీడీపీ

**కారేపల్లి, మే28(జనంసాక్షి):** తెలుగుదేశం వ్యవస్థాపకులు దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 103 జయంతిని గురువారం కారేపల్లిలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ జిల్లా నాయకులు మండెపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. బాణా సంచా కాల్చి, కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంపిణి చేశారు. టీడీపీ జెండాను మండెపూడి శ్రీనివాసరావు అవిష్కరించారు. అనంతరం కారేపల్లి పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణి చేశారు. ఈసందర్భంగా మండెపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగుజాతి ఆత్మ గౌరవాన్ని, ఔనత్యాన్ని చాటిచెప్పిన వారిలో ఎన్టీఆర్ ఒకరన్నారు. ఈకార్యక్రమంలో ఎన్టీఆర్ వీరాభిమాని బిక్కు దంపతులు, టీడీపీ నాయకులు గంగరబోయిన శ్రీనివాస్, ఉప సర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి, చిన్ని శ్రీనివాస్, దుద్దుకూరి వెంకన్న, ఎలగందుల మధు, హోటల్ రాము, కంచి సాయి, హున్య, సాయిన్ని సాయిదయ్య, నరసింహారావు, నూకల నగేష్, శేషయ్య, రామకఅష్ణ, నాగేశ్వరరావు, సూర్యం, మత్రు ,బిక్కు రాజు,నేరెళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలి

## బిజెపి పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్

**హుజూర్ నగర్, (జనంసాక్షి):**
ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ అన్నారు. గురువారం ఆయన అధ్యక్షతన బిజెపి పార్టీ బిఎల్ఎ కార్యశాలలో హుజూర్ నగర్ పట్టణంలోని బిజెపి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు కొండ హరీష్ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని దేశ వ్యాప్తంగా చేయిస్తున్నటువంటి ప్రత్యేక సమగ్ర సవరణ (ఎాఐఖ్) ప్రక్రియ తెలంగాణ రాష్ట్రంలో కూడా వచ్చే జూన్ నెల 25న ప్రారంభమవుతుందని, దానిలో భాగంగా భారతీయ జనతా పార్టీ తరఫున ప్రతి పోలింగ్ బూత్ కు కూడా ఒక బూత్ లెవెల్ ఏజెంట్ ను నియమించడం జరిగిందని, ఈ ప్రక్రియలో పార్టీ తరపున బిఎల్ఎ ల పూర్తి సహకారం ఎలక్షన్ కమిషన్ కు ఉంటుందని అలాగే ఈ ప్రక్రియలో ఎలా పాల్గొనాలి, ఏం చేయాలనే విధివిధానాలను బి ఎల్ ఎ లందరికీ కూడా నిర్వహించిన కార్యశాలలో భాగంగా తెలియజేశారు. అలాగే ఈ ప్రక్రియ తర్వాత ఓటర్ల జాబితాలో తప్పులుతడకలు లేకుండా పూర్తి పారదర్శకంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు పిడమర్తి చంద్రయ్య, రూరల్ మండల అధ్యక్షుడు నారపురెడ్డి, సోమగాని ప్రదీప్, పట్టణ ప్రధాన కార్యదర్శి గుండా గోపి, రాళ్లబండి రామారావు, మాడుగుల లక్ష్మీనారాయణ, బెల్లంకొండ నరేష్, సతి బలవంత సింగ్, కామళ్ళ వంశీ, జనార్దన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, నరసయ్య, వేముల నరేష్ తదితర బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంజనేయస్వామి ఆలయానికి గుడిపుడి ట్రస్ట్ వితరణ



**కారేపల్లి, మే 28 (జనంసాక్షి) :** కారేపల్లి మండలం తులిశ్యాతండాలో నిర్మిస్తున్న శ్రీ అభయ అంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి గుడిపుడి వెంకట్రావమ్మ ట్రస్ట్ చైర్మన్ గుడిపుడి తిరుమలరాలు గురువారం రూ.10016/- లను వితరణ చేశారు. గేటుకారేపల్లిలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తిరుమలరావును కలవగా స్పందించిన ఆయన అలయానికి వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వల్లబినేని చంద్రశేఖర్, అలయ నిర్మాణ కమిటీ సభ్యులు సపావట్ నాగులు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఎవరో చేసిన తప్పుకి రైతన్నలు బలి



**వలిగొండ, మే 28 (జనంసాక్షి)**
మండలంలోని దాసిరెడ్డిగూడెం గ్రామంలో కాల్వ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు పెట్టిన మంటలకు పదిమంది రైతులకు సంబంధించిన బోర్లు, చాటర్లు, విద్యుత్ వైర్ల కాలి బూడిద అయ్యాయి. నష్టాల్లో కూరుకుపోయామని తమను ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి ఆదుకోవాలని బాధిత రైతులు ఆవేదనతో కోరుతున్నారు.

## నందమూరి తారక రామారావు 103 వ జయంతి వేడుకలు

### టిడిపి పట్టణ అధ్యక్షులు : కొమ్మగాని వెంకటేశ్వర్లు గౌడ్



**హుజూర్ నగర్ మే 28 (జనంసాక్షి):**
మహానటుడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు 103 వ జయంతి వేడుకలను గురువారం హుజూర్ నగర్ పట్టణంలోని టౌన్ హాల్ లో ఆయన విగ్రహానికి టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మగాని వెంకటేశ్వర్లుగౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెండి తెరపైనే కాకుండా రాజకీయ యవనికపైనా ఎన్టీఆర్ ముద్ర చెరిగిపోనిదని కొనియాడారు. ని పట్టణంలోని శాంతి స్థూపం వద్ద పలువురు హమాలీల తో కలిసి ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను సిఐటియు నాయకులు శీతల రోశపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ అంతకు ముందు పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలలో వైవిధ్యమైన పాత్రలు పోషించి కోట్లాదిమంది ప్రేక్షకుల నీరాజనాలు అందుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మేకల వెంకటేశ్వర్లు, మినాల సైదులు ,గుండెబోయిన వెంకన్న , పొందూరు సత్యనారాయణ, ఐల వెంకన్న గౌడ్ , కొమ్ము శ్రీను, పందిపోటు రవిశంకర్, గూడెపు రాములు, కొంక పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు

**చింతపల్లి, మే 28(జనంసాక్షి)**
చింతపల్లి మండల కేంద్రంలో జరిగిన బక్రీద్ వేడుకల్లో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొన్నారు. సందర్భంగా ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి, ఈద్గా, దర్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఆ తర్వాత ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బక్రీద్ పండుగ త్యాగం, ప్రేమ, సోదరభావానికి ప్రతీక అని అన్నారు. అన్ని మతాల ప్రజలు ఐక్యంగా కలిసి జీవించడం ద్వారా సమాజంలో శాంతి, సామరస్యం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి మైనార్టీ మత పెద్దలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ముచ్చర్ల యాదగిరి, స్థానిక సర్పంచ్, కాసారపు శ్వేతా శ్రీనివాస్ ఎండి జహంగీర్, ఎలిమినేటి నరసింహ , సలీం,ఎండి రియాజ్ పాషా, వందనపు ఆంజనేయులు, గోవిందు రవి కుమార్, ముషావర్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# నర్సింహాపురంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



**మునగాల, మే 28(జనంసాక్షి):**
మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామంలో శ్రీ కోదండరామ స్వామి కళ్యాణ మండపం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి గజమాలలు వేసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి ఘనంగా నివాళులు అర్పించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేమూరి సత్య నారాయణ మాట్లాడుతూ, తరాలు మారిన తరగని అభిమానాన్ని చూంగొన్న మహనీయుడు మహానుభావుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, సినీ రాజకీయ రంగంలో మకుటం లేని మహారాజు, తెలుగు వారి ఖ్యాతిని దశ దిశల వ్యాపింపజేసి ప్రత్యేక గుర్తింపు తెచ్చి తెలుగుదేశం పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లో అఖండ విజయం సాధించి ముఖ్యమంత్రిగా ఎన్నికై తొలిసారి ప్రాంతీయ పార్టీ దేశ రాజకీయాల్లో చక్రం తిప్పి నేషనల్ ఫ్రంట్ చైర్మన్ గా, ఢిల్లీ రాజకీయాలని శాసించిన రాజకీయ దురంధరుడు బడుగు బలహీన వర్గాలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించి రాజకీయ ఉపాధి కల్పించిన మహా నేత, ప్రతి పేదవాడికి అండగా నిలిచి కూడు గూడు గుడ్డ కల్పించిన రాజనీతిజ్ఞుడు, సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళని నమ్మి ఎన్నో నూతన సంస్కరణలకు ఆద్యుడు, తెలుగువారికి ఆరాధ్య దైవం స్వర్గీయ నందమూరి తారక రామారావు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రెడ్డబోయిన ప్రశాంత్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొమ్ము చిన్నవెంకన్న, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షుడు కేశబోయిన నాగరాజు, బిజెపి మండల ఉపాధ్యక్షులు వీరబోయిన వినోద్, ఎన్టీఆర్ అభిమానులు వీరాస్వామి, శ్రీను, వెంకన్న, వీరబాబు, పుల్లయ్య, పిచ్చయ్య, నారయ్య, అంజయ్య, లింగయ్య, యాదగిరి, నరేష్, మురళి, లింగయ్య, రామస్వామి, పూర్ణయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



## బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన జాలా నర్సింహా రెడ్డి

హజ్రత్ ఇబ్రహీం త్యాగానికి ప్రతీకగా నిర్వహించుకునే బక్రీద్(ఈద్-ఉల్-అదా) పర్వదినం సందర్భంగా మొహమ్మద్ అన్వర్ హుస్సేన్ కుటుంబ సభ్యులకు గురువారం పిసిసి సభ్యులు, పిఎసిఎస్ చైర్మన్ జాలా నర్సింహా రెడ్డి ఈద్ ముబారక్ తెలిపారు. స్వార్థం, అసూయ, రాగద్వేషాలను విడిచిపెట్టి మానవులలో త్యాగాన్ని వ్యాపింప చేయడమే బక్రీద్ పండుగ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. త్యాగబుద్ధిని, నిజమైన భక్తి ప్రపత్తులు కలిగి ఉన్నవారే దైవ కృపకు పాత్రులు అవుతారు అనే సూక్తిని బక్రీద్ మనకు తెలియజేస్తోందని అన్నారు. నేటి ఆధునిక కాలంలో సాటి మనిషిని ప్రేమించే వారే నిజమైన దైవభక్తులుగా పరిగణించబడతారని వెల్లడించారు. హజ్రత్ ఇబ్రహీం స్ఫూర్తిగా అందరూ సాటివారిని ఆదరిస్తూ సహృదయతతో ముందుకు సాగాలని తెలిపారు. అల్లా ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ దేనేటీ విందు కార్యక్రమంలో వీరితోపాటు ఏడిఈ నున్నవత్ చందు నాయక్, అన్వర్ హుస్సేన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జనంసాక్షి , దేవరకొండ



# సంగారంలో ఈదురుగాలుల బీభత్సం

## బాధితులకు బుసిరెడ్డి ఫౌండేషన్ ఆర్థిక సహాయం

**పెద్దవూర మే 28 జనంసాక్షి**
సంగారం (గ్రామ పంచాయతీ)ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, వీచిన ఈదురుగాలులకు సంగారం గ్రామ పంచాయతీ పరిధిలో తీవ్ర నష్టం వాటిల్లింది. గాలి తీవ్రతకు గ్రామానికి చెందిన దాదాపు నాలుగు కుటుంబాల ఇండ్ల పైకప్పులు (రేకులు/పెరడు) పూర్తిగా ఎగిరిపోయాయి. దీంతో ఆయా కుటుంబాలు నిలువ నీడ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.విషయం తెలుసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగ రెడ్డి గ్రామాన్ని సందర్శించారు బాధితుల ఇళ్లను స్వయంగా పరిశీలించి వారిని పరామర్శించారు ఈ కష్టసమయంలో అధైర్యపడవద్దని తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయంసహృదయంతో స్పందించిన పాండురంగ రెడ్డి గారు తక్షణ సహాయంగా నష్టపోయిన నాలుగు కుటుంబాలకు తన వంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు ఆర్థిక సాయం పొందిన వారిలోకంచర్ల శ్రీనివాస్ రెడ్డి తరి లక్ష్మమ్మ ఆలేటి చందన మాతంగి భాస్కర్ ఉన్నారు.కష్టాల్లో ఉన్న తమను గుర్తించి తక్షణమే స్పందించి ఆర్థికంగా ఆదుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగ రెడ్డి గారికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.పాల్గొన్న ముఖ్య నాయకులు యువత ఈ పరామర్శ కార్యక్రమంలో సంగారం సర్పంచ్ ఈసం రమేష్ వల్లెం వెంకటనారాయణ ఇరుమాది రవీందర్ రెడ్డి యూత్ అధ్యక్షులు తరి రవి మర్రి సాయి నరేష్ వెమ్మలరెడ్డి సందీప్ పూరే కోటేష్ కంచర్ల వెంకట్ రెడ్డి తరి బిక్షం ఈసం పిచ్చయ్య మరియు గ్రామ ప్రజలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కిష్టాపురంలో భగ్గుమన్న పాత కక్షలు

**చింతలపాలెం(జనంసాక్షి)**
సూర్యాపేట జిల్లా,చింతలపాలెం మండలంలోని కిష్టాపురంలో పాత కక్షలు మళ్లీ రగిలాయి.ఈ ఘటనలో ఓ ఇంటిపై దాడి చేసిన మరో వర్గం,ఇటీవల స్థానిక సంస్థల ఎలక్షన్ సమయంలో కూడా గ్రామంలో ఘర్షణలు చోటు చేసు కున్నాయి.ఒక వర్గాన్ని దారి కాచి దాడి చేసినట్లుగా మరో వర్గం ఆరోపణలు, ఒకరి పరిస్థితి విషమంగా ఉండి ఖమ్మం తరలించినట్లు ప్రాథమిక సమాచారం, మాజీ ఎంపీటీసి పై దాడి తీవ్ర గాయా లు కావడంతో హుజూర్నగర్ హాస్పిటల్ కి తరలించినట్లు సమాచరం. ప్రస్తుతాని కి గ్రామం పోలీసుల పర్యవేక్షణలో ఉంది.



# వంద రోజుల్లో అభివృద్ధికి బాటలు

## 22వ వార్డు ప్రగతి నివేదిక విడుదల చేసిన కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్

**భువనగిరి, మే28 (జనంసాక్షి)**
భువనగిరి మున్సిపాలిటీ 22వ వార్డు కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ తన పదవీకాలంలో 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్డు అభివృద్ధిపై ప్రత్యేక ప్రగతి నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా గత వంద రోజుల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను ప్రజలకు వివరించారు.ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో సుమారు రూ.10 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు కౌన్సిలర్ విఘ్నేష్ తెలిపారు. ముఖ్యంగా వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా మూడు కొత్త మోటార్లను ఏర్పాటు చేయడంతో పాటు ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు.రానున్న రోజుల్లో మరిన్ని నిధులను సమీకరించి వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని, ఈ అభివృద్ధి యజ్ఞంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతోనే వార్డు సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జాలిగం శివ, ప్రమోద్, మణి, వరుణ్, దినేష్, రాజేందర్, మహేందర్, రాము, ప్రసన్న కుమార్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి: మాజీ ఎంపీ నామ



**ఖమ్మం కార్పొరేషన్, మే 28 (జనంసాక్షి)**
ఎన్టీఆర్ జననమే ఒక చరిత్ర అని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా గురువారం నాడు ఖమ్మం నగరం లోని లకారం ట్యాంక్ బండ్ నందు ఉన్న 54 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం వద్ద మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తో కలసి మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు నివాళ్లు అర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగాల్లో చరిత్ర సృష్టించిన గొప్ప నాయకుడు ఎన్టీఆర్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, మాజీ ముఖ్యమంత్రి డా. నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకొని ఆయన సేవలను స్మరించుకుంటున్నట్లు బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎన్టీఆర్ వ్యక్తిత్వం, సినీ మరియు రాజకీయ రంగాల్లో ఆయన సాధించిన ఘనతలు భావితరాలకు కూడా స్ఫూర్తిగా నిలుస్తున్నాయని నామ తెలిపారు. తెలుగు చలనచిత్ర రంగానికి ఆయన అందించిన విశిష్ట సేవలు, రాష్ట్ర ప్రజల కోసం చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాలు చిరస్మరణీయమని కొనియాడారు. రాజకీయ నాయకుడిగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూనే విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ఎన్టీఆర్ తన హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపారని గుర్తు చేశారు. పటేల్?పట్వారీ వ్యవస్థ రద్దు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, రూ.2 కిలో బియ్యం, జనతా వస్త్రాల పంపిణీ, పేదలకు గృహ నిర్మాణాలు వంటి కార్యక్రమాలు సామాజిక న్యాయానికి నిదర్శనంగా నిలిచాయని పేర్కొన్నారు. ఈ పథకాలు పేదలకు ఆర్థికంగా, సామాజికంగా ఎంతో భరోసా కల్పించాయన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించడం తెలుగు ప్రజల చిరకాల కోరిక అని నామ పేర్కొన్నారు. ఆయన దేశానికి, తెలుగు జాతికి చేసిన సేవలను గుర్తించి భారతరత్న పురస్కారం ప్రకటించాలని తాను 17వ లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు కోసం ఆనాడు పార్లమెంటరీ పార్టీ నేతగా ఉండి 15వ లోక్‌సభలో తాను చేసిన పోరాటం అలాగే ఎన్టీఆర్ కుటుంబ సభ్యుల సహకారం, అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో పాటు నాటి లోక్‌సభ స్పీకర్‌తో ప్రత్యేకంగా మాట్లాడి పార్లమెంట్ ప్రాంగణంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు జరిగిందన్నారు. ఎన్టీఆర్ మరణించిన 17 సంవత్సరాల తర్వాత 2013 తాను తాను ఎంపీ గా ఉన్న సమయంలో ఆ విగ్రహం ఏర్పాటులో భాగస్వామ్యం కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. అంతేకాకుండా ఖమ్మంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే 54 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, తెలుగు జాతి గర్వించదగ్గ మహానేతకు ఇది నిజమైన నివాళిగా నిలిచిందని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అనేక ఎన్టీఆర్ విగ్రహాల ఏర్పాటు కార్యక్రమాల్లో కూడా తాను భాగస్వామ్యం అయినట్లు తెలిపారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్ స్ఫూర్తిని భావితరాలకు చేరవేయాలనే ఉద్దేశంతో ఆయా ప్రాంతాల్లో విగ్రహాల ఏర్పాటుకు కృషి చేసినట్లు నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. కేసీఆర్ కూడా తన హయాంలో ఎన్టీఆర్ లా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, బొల్లం మల్లయ్య యాదవ్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్ కుమార్, ఆర్జేసీ కృష్ణ తో పాటు పలు మండలాల నుండి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.





## ఎన్టీఆర్ కు నివాళి అర్పించిన వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య

### ఎన్టీఆర్ కి భారత రత్న ప్రకటించాలి అని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి

### తెలంగాణ గడ్డ కి నిజమైన ప్రజాస్వామ్య పరిమళాలు అద్దింది ఎన్టీఆర్ పాలనే

**ఖమ్మం,మే 28, (జనంసాక్షి) :** ఉమ్మడి రాష్ట్ర పూర్వ ముఖ్యమంత్రి , తెలుగువారి ఆత్మగౌరవాన్ని దశ దిశలా చాటి చెప్పిన దివంగత నందమూరి తారక రామారావు జయంతి పురస్కరించు కొని గురువారం వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ లోని నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చింత నిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తెలుగుజాతి గౌరవాన్ని దేశ విదేశాలలో ఇనుమడింపజేసి తెలుగు భాషకు కీర్తి ప్రతిష్టలు తీసుకుని వచ్చిన అన్న ఎన్టీఆర్ జీవితం ప్రతి ఒక్కరికి మార్గదర్శకం అని తెలిపారు. ఎన్టీఆర్ చూపిన మార్గంలో తెలుగువారి ప్రతిష్ట పెరిగేలా కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్ , ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

# మధిరలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**మధిర, మే 28 (జనంసాక్షి) :**
మధిర నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా గురువారం పార్టీ కార్యాలయం లో పట్టణ అధ్యక్షులు మల్లాది హనుమంతరావు అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో పార్టీ జండా ఆవిష్కరణ, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, అనంతరం ఈ ఏడాది లో టీడీపీ పార్టీకి ఎనలేని సేవలు అందించి మరణించిన నాయకుల ఆత్మకు శాంతి చేకూరాలని కొద్దిపాటి నిముషాలు మౌనం పాటించి ,పట్టణంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి, పట్టణ తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పులిహోర,మజ్జిగ పంపిణీ చేశారు. జిల్లా నాయకురాలు కోనేరు రాణి ఆర్థిక సహాయం తో జిలుగుమాడులో ఉన్న నిస్సి హరిణి ఆశ్రమం లో వికలాంగులకు, వృద్ధులకు చీరెలు పంపిణీ పట్టణ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య నాయకులు మల్లాది హనుమంతరావు, మార్నిడి పుల్లారావు, ములకపల్లి వినయ్ కుమార్,(17 వ వార్డు కౌన్సిలరు)చట్టు వెంకటేశ్వర్లు,(ప్రధాన కార్యదర్శి) మేడిపల్లి రాణి (రాష్ట్ర మహిళా కార్యదర్శి), చావా శివాజీ గారు,గద్దల ప్రకాశరావు ,మాదాల నరసింహారావు మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందేలా కృషి చేశారు అని అన్నారు. వారుచేసిన జనరంజక పథకాలను గుర్తు చేశారు. ఎన్టీఆర్ ఆశయసాధనకై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ,లోకేశ్ కృషి చేస్తూ ప్రజారంజక పాలన అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమం లో మన్నేపల్లి రత్నకుమారి,జమ్ముల కోటేశ్వరావు,గడ్డం మల్లికార్జున,సీనియర్ నాయకులు పాశం రామనాథం, వీరవల్లి కోటేశ్వరావు,వాసిరెడ్డి ఈశ్వరావు, పోతినేని కోటేశ్వరావు,నాగులవంచ శ్రీనివాసరావు, వేల్పుల కొండ, రావూరి రంగయ్య,వినుకొండ కృష్ణమూర్తి, గూడెల్లి నాగయ్య,కేశవపట్నం రామయ్య,తిరుపతి కృష్ణమూర్తి, చెన్నం స్వామి,బోనాల ప్రసాద్, ఇంకా ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



# ఉచిత ఆన్లైన్ విద్యను సద్వినియోగం చేసుకోండి

## మాజీ ఎంపీ నామ

**ఖమ్మం కార్పొరేషన్, మే 28 (జనంసాక్షి)**
లక్ష్యంతో చదివి రాణించండి యువతకు మాజీ ఎంపీ నామ పిలుపు ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో రాకేష్ రెడ్డి ఈ క్లాసెస్ యాప్ ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నామ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన కోచింగ్ అందించాలనే లక్ష్యంతో చక్రవర్తి రూపొందించిన ఈ యాప్‌కు ఎనుగుల రాకేష్ రెడ్డి ఆర్థిక సహకారం అందించడం అభినందనీయమన్నారు. నిపుణుల బోధనతో ఇంటి నుంచే మొబైల్ ద్వారా క్లాసులు వినే అవకాశం ఉందన్నారు. తక్కువ ఖర్చుతో పోటీ పరీక్షలకు సిద్ధమవ్వొచ్చని, యువత క్రమశిక్షణతో చదివి లక్ష్యాలు సాధించాలని సూచించారు. బిట్స్ పిలానీ యూనివర్సిటీ నుంచి విద్యాభ్యాసం పూర్తి చేసిన రాకేష్ రెడ్డి మంచి ఉద్యోగావకాశాలను వదులుకొని స్వగ్రామానికి సేవ చేయాలనే ఉద్దేశంతో ముందుకు రావడం ప్రశంసనీయమన్నారు. ప్రతి ఒక్కరి వద్ద ఉన్న మొబైల్‌ను సద్వినియోగం చేసుకొని ఈ యాప్ ద్వారా ఉచిత ఆన్‌లైన్ విద్యను పొందాలని, పోటీ పరీక్షల్లో రాణించాలని యువతకు పిలుపునిచ్చారు.



# మండల వ్యాప్తంగా ఘనంగా బక్రీద్ వేడుకలు

**చంద్రుగొండ, మే 28 (జనంసాక్షి):**
త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను మండల వ్యాప్తంగా ముస్లింలు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకున్నారు. చంద్రుగొండ, తిప్పనపల్లి, మహ్మద్ నగర్, గ్రామాల్లో ఉదయాన్నే మసీదులకు, ఈద్గాలకు భారీ సంఖ్యలో తరలివచ్చిన ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇమామ్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేయించి, పండుగ విశిష్టతను, ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని వివరించారు. హిందూ ముస్లిములు శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక దువా చేశారు. పండుగ సందర్భంగా మండల వ్యాప్తంగా మత సామరస్యం ఉట్టిపడింది. ముస్లిం సోదరులకు హిందూ బంధువులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



# రమేష్ దాబాపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

### ○పాడైన మాంసం, కుళ్లిన గుడ్లు స్వాధీనం.. ○ఫుడ్ లైసెన్స్ తాత్కాలిక సస్పెన్షన్..

**ఖమ్మం రూరల్,మే 28 (జనంసాక్షి):**
రమేష్ దాబాలో చికెన్ ఆర్డర్ చేస్తే బల్లి దర్శనం అనే వార్త కథనం'జనం సాక్షి' దినపత్రికలో ప్రచురించిన విషయం విధితమే. ఈ కథనంతో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం దాబాపై దాడులు నిర్వహించి శాంపిల్స్ సేకరించారు. తనిఖీల్లో భాగంగా వంట శాలలో తీవ్ర అపరిశుభ్రత,పారిశుద్ధ్య లోపాలు బయటపడటంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్? 2011 నిబంధనలకు విరుద్ధంగా దాబా నిర్వహణ సాగుతున్నట్లు గుర్తించారు. తనిఖీల సమయంలో పాడైపోయిన మాంసం, కుళ్లిన గుడ్లు, ఆహార పదార్థాల వద్ద పురుగులు, దుమ్ముతో నిండిన పైకప్పులు, అపరిశుభ్రమైన నేలలు, మూసుకుపోయిన డ్రైనేజీ వ్యవస్థ వంటి అనారోగ్యకర పరిస్థితులు వెలుగులోకి వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారే పరిస్థితులు ఉన్నందున నిర్వాహకులకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే చట్టపరమైన పరిశీలన కోసం రెండు ఆహార నమూనాలను సేకరించి,నిబంధనల ఉల్లంఘన నేపథ్యంలో దాబా ఫుడ్ లైసెన్స్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేశామని అన్నారు. నిర్వాహకులకు ఈబూాంఎ నిబంధనలు, పరిశుభ్రత ప్రమాణాలు, ఆహార భద్రతా మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. వినియోగదారుల ఆరోగ్యానికి భంగం కలిగించే విధంగా ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయం చేపట్టే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ ఇన్స్ ఫెక్టర్ లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక

### జిల్లా కన్వీనర్ గా మూల నాగిరెడ్డి



**బూర్గంపహాడ్ మే 28 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా – తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక జిల్లా కన్వీనర్ గా మూల నాగిరెడ్డి ని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నన్ను నియమించినందుకు తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు బట్టు రాజేందర్ నాయక్ కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడికి న్యాయం చేసేలా చూస్తానని, ప్రతి ఉద్యమకారుడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, నియోజకవర్గాల నుంచి ఉద్యమకారులను గుర్తించి వాళ్ళకి తగిన న్యాయం చేస్తానని, ఉద్యమంలో పేపర్ కటింగ్ వాళ్ళకి అన్యాయం జరగకుండా చూస్తానని తెలియజేశారు.

## పేద విద్యార్థినికి నగదు ప్రోత్సహకం

## అందజేసిన బుసిరెడ్డి పాండురంగారెడ్డి

**నిడమనూరు మే 28 జనంసాక్షి**
నిడమనూరు మండలకేంద్రం వాస్తవ్యులు పేదకుటుంబానికి చెందిన నాగరాజు కుమార్తె భావన ఇంటర్మీడి యట్ ఫలితాల్లో 986 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి ఆ పేద విద్యార్థినికి ప్రోత్సాహకంగా రూ.10 వేల రూ నగదును అందజేసి, విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు. భావన ఉన్నత చదువులకు సైతం పూర్తి సహకారం అందిస్తామని ఆయన ఆ పేదకుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు విద్యలో రాణించడం ద్వారానే సమాజంలో మెరుగైన స్థానాన్ని,ఉపాధి అవకాశాలను పొందగలరన్నారు. తన చదువుకు సహాయం చేసిన బుసిరెడ్డి పాండురంగారెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి సాగర్ మాజీ ఎంపిపి దిలీప్ రెడ్డి, బుర్రి రామిరెడ్డి,కృష్ణారెడ్డి, శిరీష, స్థానిక నాయకులు పాల్గొన్నారు.





## డి.బి.ఆర్ సర్కిల్లో ఉచిత మజ్జిక పంపిణీ

**ఖమ్మం రూరల్, మే 28(జనంసాక్షి):**
ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని డి.బి.ఆర్ సర్కిల్ వద్ద చింతల నాగేశ్వరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చింతల నాగేశ్వరావు వల్ల కుమారుల సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ అధ్యక్షులు చింతల ఉదయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేసి ఎండల తీవ్రత నుంచి ఉపశమనం కలిగించే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రామిశెట్టి సన్నీ,రెబ్బగొండ్ల గోపి,చింతల బన్నీ, చింతల అమ్ములు,పొన్నం భార్గవ్,కర్రీ ఉమేష్,తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితురాలికి ఆపన్నహస్తం

## అందించిన తోటి మిత్రులు

**బూర్గంపహాడ్ మే 28 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ 2006-07 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు తమ స్నేహితురాలికి ఆపన్నహస్తం అందించారు. చింతచిగురు కోసే క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టుపై నుండి జారిపడి నడుం విరిగి మంచాన పడిన తమ స్నేహితురాలికి ఆర్థికంగా అండగా నిలిచారు. ఆంధ్రాలోని కుక్కునూరుకు చెందిన ఆవుల నాగమణి 2022లో జరిగిన ప్రమాదంలో చెట్టుపై నుండి కిందపడి నడుం విరిగి మంచాన పడింది. దీంతో ఆమె కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. ఇటీవల తన స్నేహితులు పాల్వంచలోని పెద్దమ్మతల్లి ఆలయం వద్ద 50 మందితో గెట్ టు గెదర్ నిర్వహించారు. ఆ సమయంలో తోటి స్నేహితులు ఎస్ఎస్సీ హెల్పింగ్ నేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు తాళ్ల రాజశ్రీరెడ్డి సహకారంతో పల్లంటి రమేష్, ఇనుమల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తోటి మిత్రుల నుండి రూ.32,500 నగదు సేకరించారు. ఆ మొత్తం నగదుతో పాటు మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు తీసుకుని కుక్కునూరులో ఉన్న నాగమణి నివాసానికి వెళ్లి అందజేసి తమ స్నేహాన్ని చాటుకున్నారు. అంతేకాకుండా స్నేహితురాలి కుటుంబానికి తామంతా అండగా ఉంటామని, ఎప్పుడు ఏ కష్టమొచ్చినా స్నేహితులుగా తామున్నామంటూ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తోటి స్నేహితులు ఇలేక, మల్లేశ్వరి, రాధ, లక్ష్మి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



### కల్లూరు మండలంలో ఘనంగా

## స్వర్గీయఎన్టీఆర్ జయంతి వేడుకలు

**కల్లూరు మే 28(జనంసాక్షి)**
తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు తెలుగు ప్రజల ఆరాధ్య దైవం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు103వ జయంతి వేడుకలను కల్లూరు మండలంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గురువారం అత్యంత కోలాహలంగా అంగరంగ వైభవంగానిర్వహించారు. మండల పరిధిలోని లింగాల, చెన్నూరు, యజ్ఞ నారాయణపురం, చంద్రుపట్ల, కల్లూరు తదితర గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కల్లూరు మెయిన్ సెంటర్లో గల తెలుగుదేశం పార్టీ దిమ్మ వద్ద మండల అధ్యక్షులు పొట్రూ శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ శ్రేణులు జిల్లా నాయకులు జాస్తి శ్రీనివాసరావు, పట్టణ కమిటీ అధ్యక్షులు కట్టా గోపాలరావు,తో కలసి, కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు. పలువురు పార్టీ శ్రేణులు స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రజలకు అందించిన అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి వివరించారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి విశేషమైన కృషి చేసిన వ్యక్తి, అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసి పేదల హృదయాలలో చిరస్థాయిగా స్థానం సంపాదించిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ ఎన్టీ రామారావు అని ఆయన సేవలను కొనియాడారు. ఎన్టీఆర్ జయంతి వేడుకలు సందర్భంగా ప్రజలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కల్లూరు మండలం అధ్యక్షులు పోట్రు శ్రీనివాసరావు, కల్లూరు పట్టణ ఉపాధ్యక్షులు బొల్లం మీసాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి దూపకుంట్ల మురళీకృష్ణ, నున్నా వెంకటయ్య, లింగాల మాజీ సర్పంచ్ దేవరపల్లి అరుణ నాగప్రసాద్, యజ్ఞనారాయణపురంమాజీ సర్పంచ్ రావిసూర్యనారాయణ,జీనుగు మరియ దాసు, గోసు కృష్ణారావు, షేక్ చిన్న బుడెన్, ఆళ్ల వెంకటేశ్వరరావు, ఎస్ కే యాకూబ్ అలీ, ఎన్టీఆర్ అభిమానులు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో తెదేపాకు పూర్వవైభవం ఖాయం

**కోదాడ,( జనం సాక్షి):**
నల్గొండ పార్లమెంటు నియోజకవర్గ వ్యాప్తంగా రెండు రోజులుగా కోదాడ పట్టణంలో వర్చువల్ పద్ధతిలో నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడు గురువారం ముగిసింది. ఇన్చార్జ్‌లు ముత్తినేని సైదేశ్వరరావు, ఓరుగంటి ప్రభాకర్ ల పర్యవేక్షణలో ఈ మహాసభలు విజయవంతమయ్యాయి. ముగింపు సభలో ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న తెదేపా ముఖ్య నాయకులు, నియోజకవర్గాల ఇన్చార్జ్‌లు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం సభనుద్దేశించి ఇన్చార్జ్‌లు మాట్లాడుతూ అధినేత చంద్రబాబు నాయుడు వర్చువల్ సందేశం క్యాడర్‌లో సరికొత్త ఉత్తేజాన్ని నింపిందని, రాబోయే ఎన్నికలే లక్ష్యంగా అందరం కలిసికట్టుగా పనిచేస్తామని తెలిపారు. మహానాడు విజయవంతం కావడంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం, సరికొత్త జోష్ నెలకొందని అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ అంతా మునుపటి కంటే బలమైన సంకల్పంతో ఉందని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం రావడం ఖాయం అన్నారు. ఈ సమావేశంలో మువ్వా అరుణ్ కుమార్, చాగంటి వెంకటేశ్వరరావు,కోడె వాసు, భయ్యా నారాయణ, జనపనేని కృష్ణ,కొల్లు నరసయ్య, సాతులూరి గురవయ్య, బండ్లమూడి వెంకటేశ్వరరావు, గుండు నాగేశ్వరరావు, పిట్టల శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## మహిళ కడుపులో నుంచి నాలుగు కేజీల
# కనితి తొలగింపు



**కల్లూరు మే 28 (జనంసాక్షి)**

తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్న తూటిపల్లి జ్యోతి అనే మహిళ కడుపులో నుండి కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ భానోత్ రమేష్ ఆధ్వర్యంలో డాక్టర్ అశోక్ వైద్య సిబ్బంది సహకారంతో ఆపరేషన్ చేసి నాలుగు కేజీల కనితిని తొలగించారు. జిల్లాలోని పందిళ్ళపల్లి /చెరువు మాదారం గ్రామంలో నివాసం ఉంటున్న తూటిపల్లి జ్యోతి గత కొంతకాలంగా కడుపునొప్పితో అనారోగ్యానికి గురై తీవ్రమైన ఇబ్బందులు పడుతుంది. ఖమ్మంలోనే అనేక ఆసుపత్రుల్లో తిరిగిన ప్రయోజనం లేకపోవడంతో కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా దీనికి సరైన సర్జరీ చేసే వైద్య బృందం ఉందని తెలియడంతో గత మూడు రోజుల క్రితం కల్లూరు లోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్కు వైద్యం నిమిత్తం వచ్చారు. ఆస్పత్రిలో అడ్మిషన్ అనంతరం అన్ని రకాల పరీక్షలు నిర్వహించి కల్లూరు సిహెచ్ సి వైద్యులు డాక్టర్ బానోత్ రమేష్ ఆధ్వర్యంలో ఆపరేషన్ విజయవంతంగా చేసి కడుపులో నుంచి నాలుగు కేజీలకనితిని తొలగించారు. అరుదైన ఆపరేషన్ చేసి కనితిని తొలగించి రోగికి ఉపశమనం కలిగించడం పట్ల రోగి కుటుంబ సభ్యులు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## వరి పొలాలకు పెట్టిన నిప్పుకు మామిడి, పామాయిల్ తోటలకు పొంచి ఉన్న పెను ప్రమాదం

### నిప్పు పెట్టడం వల్ల ఇతర తోటలకు జరిగే ప్రమాదాల పట్ల రైతులు ఆలోచించాలి

**పెనుబల్లి మే 28(జనంసాక్షి)**



రైతులు తమ వరి పొలాలకు నిప్పు పెట్టడం వల్ల వ్యవసాయ భూములకే కాకుండా సమీపంలో ఉన్న మామిడి,పామాయిల్ తోటకు పెను ప్రమాదం పొంచి ఉంది. పెనుబల్లి గ్రామంలో గురువారం కొందరు రైతులు తమ వరిపొలాలకు పెట్టిన నిప్పు వలన మంటలు భారీగా చెలరేగి సమీప పామాయిల్ తోటకు,మామిడి తోటకు నిప్పు అంటుకొన్నది. ఒ రైతు పాడిగేదల మేత కోసం వేసిన జున్ను గడ్డి సైతం పూర్తిగా కాలిపోయింది. ఎవరో పెట్టిన నిప్పుకు లక్షలాది రూపాయల విలువచేసే మామిడి, పామాయిల్ తోటలకు మంటలు వ్యాపించి కాలి బూడిదైపోతే ఎవరు బాధ్యత వహిస్తారు, ఎవరిని తప్పు పట్టాలి, రైతులు ఇలా పొలాలకు నిప్పు పెట్టడం వల్ల భూసారం దెబ్బ తినడమే కాకుండా పంటలకు ఉపయోగపడే వాన పాములు, కీటకాలు నశించిపోతాయని వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలు చెబుతున్నా కూడా రైతులు పెడచెవిన పెడుతున్నారు. గతవారం గంగదేవిపాడు గ్రామంలో రైతు తమ పొలాలకు పెట్టిన నిప్పు కారణంగా మంటలు భారీగా చెలరేగి సమీపంలో ఉన్న 14 ఎకరాల మామిడి తోట కాలి బూడిదైపోయిన సంఘటన జరిగింది. దీంతో మామిడి, పామాయిల్ తోటల రైతులు ఆందోళన చెందుతున్నారు.

# త్యాగం ప్రేమ నేర్పించే పండుగ బక్రీద్

### భద్రాచలం బక్రీద్ ప్రార్థనలో మత పెద్దలు

**భద్రాచలం మే 28 (జనంసాక్షి)**



త్యాగం ప్రేమ నేర్పించే పండుగ బక్రీద్ అని ముస్లిం మత పెద్దలు అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా భద్రాచలం పట్టణంలోని ఏఎంసీ కాలనీ ఈద్గాలో వేలాది మంది ముస్లిం సోదరులు బక్రీద్ పండుగ ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ త్యాగం ప్రేమ నేర్పించే పండుగని భారతదేశంలో అందరం కలసిమెలిసి ఉండాలని, ప్రపంచ యుద్ధాలు ఏవి జరగకుండా ప్రశాంతంగా ఉండాలని, ముఖ్యంగా భద్రాచలం పుణ్యక్షేత్రంలో ఎప్పుడు లాగానే ప్రశాంతంగా ఉండాలని ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు షఫీ అబ్దుల్లా, మునాఫ్, సరఫరాజ్, షేక్ అజీమ్, సలీం, అక్బర్, షంషేర్ బాబా, జబ్బార్, లాలు, రఫీ, షరీఫ్, ముజమిల్ రహీం తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరు లో ఘనంగా
# బక్రీద్ పర్వదిన వేడుకలు

**కల్లూరు మే 28(జనంసాక్షి)**



మహమ్మద్ ప్రవక్త బోధించిన సమైక్యతను సోదర భావాన్ని అందరూ అనుసరించాలని సందేశాన్ని తెలియజేస్తూ త్యాగానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ పర్వదినం వేడుకలను మండలంలోని ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక నమాజు ప్రార్ధనలతో గురువారం ఘనంగా జరుపుకున్నారు. కల్లూరు పట్టణ పరిధిలో ని పుల్లయ్య బంజర రహదారి వైపున గల ఈద్గా వద్ద బక్రీద్ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వందలాదిమంది ముస్లిం సోదరులు పాల్గొని సామూహికంగా ప్రత్యేక నమాజ్ చేశారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు బక్రీ ద్ పండుగ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపించడం కోసం నమ్మిన సిద్ధాంతాల కోసం కన్న ప్రేమను సైతం బలిచ్చేందుకు సిద్ధమైన హజరత్ ఇబ్రహీం త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకొని సమాజంలోని తోటి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకొని సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్, పలువురు కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ముస్లిం సోదరుల గృహాలకు వెళ్లి వారిని కలుసుకొని బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పర్వదిన వేడుకల్లో పలువురు ముస్లిం పెద్దలు సయ్యద్ అలీ, ఎండి హనీఫ్, షేక్ బాజీ భాయ్,ఎస్ డి ఇసాక్, సయ్యద్ నబి (మ్యాంగో బిజినెస్), మహమ్మద్ ఆరిఫ్, మున్సిపల్ కౌన్సిలర్ ఎండి ఇస్మాయిల్, సయ్యద్ ఇంతియాజ్ , ఎస్కే ముస్తఫా, రాహుల్ ప్రియాంక సేన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మెట్రోఅబ్దుల్ హబిబ్, ఎస్ కే జాన్ పాషా, ఆత్మ మాజీ డైరెక్టర్ ఎస్ కే జానీ మియా,కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చందర్రావు, పొట్రూ అర్జున్ రావు, భాగం ప్రభాకర్, బోల్లం రామారావు పట్టణ కమిటీ అధ్యక్షులు ఎస్కే ఉస్మాన్, మున్సిపల్ కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు, కాంగ్రెస్ యువ నాయకులు శ్రీలమ్ కృష్ణారెడ్డి, యాస శ్రీకాంత్, ఖమ్మం పాటి వీరస్వామి, ధరావత రవికుమార్ పలువురు ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## త్యాగ నిరతికి, త్యాగానికి ప్రతీక బక్రీద్

**ములకలపల్లి మే 29 జనంసాక్షి :**



మండలంలోని జగన్నాధపురం ఈద్గా వద్ద బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులు నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రార్థనలు జగన్నాధపురం సర్పంచ్ కుంజా వినోద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూత్యాగానికి, త్యాగ నిరతికి ప్రతీకగా ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు నిర్వహించుకొనే పండుగ బక్రీద్ (ఈద్ ఉల్ అదా) అని అన్నారు. అల్లాపై ప్రవక్త ఇబ్రహీం చూపిన అచంచలమైన విశ్వాసానికి, అంకితభావానికి ప్రతీక బక్రీద్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఈర్ల రామ్మోహన్ రావ్, సోయం బోడప్పు, మిడియం నారాయణ, రామాచారి కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జానీ,కూరం రామకృష్ణ, ముస్లిం మత పెద్దలు ఎండి ఉస్మాన్ ఖాన్, జబ్బార్, బషీర్, యాకిల్ తదితరులు పాల్గొన్నారు.

### బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ నాయకులు బత్తుల అంజి

**ములకలపల్లి మే 29 జనంసాక్షి :**



ములకలపల్లి మండల కేంద్రం లో జరిగిన బక్రీద్ పర్వదిన ప్రార్థనలో భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ నాయకుడు బత్తుల అంజి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూత్యాగానికి, భక్తిప్రపత్తులకు, దైవచింతనకు నిలువెత్తు రూపం బక్రీద్ (ఈద్–ఉల్–జుహా) పండుగ అని అన్నారు. జిల్లాలోని ముస్లిం సోదర, సోదరీమణులందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. దేవునిపై అచంచలమైన విశ్వాసాన్ని, సమాజం పట్ల త్యాగనిరతిని ఈ పండుగ మనకు గుర్తుచేస్తుంది. ఉన్నదానిలో లేనివారికి దానం చేస్తూ, అందరి శ్రేయస్సును కోరే ఇస్లాం సంప్రదాయం ఎంతో గొప్పది అని కొనియాడారు. ములకలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి జహీరుద్దీన్, మైనారిటీ పెద్దలు జబ్బర్, ఖాదర్ బాబా, నసిరుద్దీన్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

# పినరై విజయన్ పై ఈ డి దాడులు దుర్మార్గం..

**ఖమ్మం కార్పొరేషన్, మే 28 (జనంసాక్షి )**




కేరళ మాజీ ముఖ్యమంత్రి సిపిఎం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు పినరై విజయన్ మరో 10 మందిపై కేంద్ర బిజెపి ప్రభుత్వం కక్షపూరితంగా తమ చెప్పు చేతుల్లో కొనసాగుతున్న ఈ డి. ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ రేట్ సంస్థతో కేరళ మాజీ సీఎం ఇంటిపై దాడులు చేయించడం దుర్మార్గపు చర్య ఇది రాజకీయ కక్ష ఈ చర్యలకు వ్యతిరేకంగా ఈ డి తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రధాని మోడీ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు జరుగుతున్నాయని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు అన్నారు . కేరళ మాజీ ముఖ్యమంత్రి ఇంటిపై ఈడే దాడులకు నిరసనగా ఖమ్మం డివిజన్ సిపిఎం పార్టీ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ. ఈ డి సంస్థ దిష్టిబొమ్మను దగ్ధం చేయటం జరిగింది ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఎం పార్టీ వన్ టౌన్ కార్యదర్శి ఎస్కే నాగులు మీరుఅధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో ఎన్నికల ముందు బిజెపి కాంగ్రెస్ పార్టీలు కలిసి ఉమ్మడిగా పినరై విజయన్ పై తప్పుడు ప్రచారం చేశారు. ఎన్నికల అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ. కేరళ ముఖ్యమంత్రి సతీశన్ ఢిల్లీలో చర్చలు చేసి ఆ సందర్భంగానే విజయన్ ఇంటిపై ఈడి దాడులను చేయించడం జరిగింది ఇది రాజకీయ దుర్బుద్ధితో సిపిఎం పార్టీని కేరళ మాజీ ముఖ్యమంత్రి విజయన్ అప్రతిష్టపాలు చేయడం కోసం కేంద్ర బిజెపి . రాష్ట్ర కాంగ్రెస్ ఈ దుర్మార్గపు చర్యలకు పూనుకున్నది ఈ చర్యలను ఖండిస్తూ కేరళ రాష్ట్రవ్యాప్తంగా. దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున విజయన్.కు సిపిఎం పార్టీకి మద్దతుగా ఉద్యమాలు జరుగుతున్నాయి దీనిలో భాగంగానే సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు సరిత క్లినిక్ సెంటర్లో కేంద్ర ప్రభుత్వ ప్రధాని నరేంద్ర మోడీ. ఈ డి సంస్థ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దొంగల తిరుపతిరావు. మెరుగు రమణ. బండారు రమేష్ .టూ టౌన్ సిపిఎం కార్యదర్శి బోడబట్ల సుదర్శన్ పార్టీ ఖమ్మం డివిజన్ నాయకులు ఎస్ కే సైదులు. వీరభద్రం ఆర్ ప్రకాష్. గుమ్మడి బిక్షం. రంగు హనుమంత చారి. సారంగి పాపారావు. వీరబాబు సార్. అబ్దుల్ సారు, ఎస్.కె హుస్సేన్. పుల్లారావు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్యదర్శి రాజు ప్రవీణ్ కూరపాటి శ్రీనివాస్. నాగరాజు, ఎర్ర మల్లికార్జున్, పోతురాజు జార్జి, తదితరులు పాల్గొన్నారు